బస్సు సౌకర్యం లేక అవస్థలు


ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న గ్రామస్తులు

ఖిల్లాఘనపురం: మండలంలోని అన్ని గ్రామాలకు బీటీ రోడ్లున్నా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సు సౌకర్యం కల్పించడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. పేద విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించలేక చదువులు మాన్పించాల్సిన దుస్థితి నెలకొంది.

బీటీ రోడ్లు ఉన్నా..

వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాకు అన్ని వైపుల నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఖిల్లాఘనపురం ఉంది. కేవలం వనపర్తి నుంచి మండల కేంద్రం మీదుగా మహబూబ్‌నగర్ వెళ్లే ప్రధాన రోడ్డుపై ఉన్న గ్రామాలకు మాత్రమే బస్సులు నడుపుతున్నారు. దీంతో మిగతా గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. ఆయా గ్రామాల నుంచి ఆటోలలో మండల కేంద్రానికి చేరుకొని అక్కడ నుంచి పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

మూడు గ్రామ పంచాయతీలకు మాత్రమే..

మండలంలో మొత్తం 29 గ్రామ పంచాయతీలు, పలు గిరిజన తండాలు ఉన్నాయి. ప్రతి గ్రామ పంచాయతీకి ప్రభుత్వం బీటీ రోడ్డును ఏర్పాటు చేశారు. సోలీపురం, కొత్తపల్లితండా, ఖిల్లాఘనపురం, రోడ్డు మీదితండాల మీదుగా మహబూబ్‌నగర్‌కు మాత్రమే బస్సులను నడుపుతున్నారు.

ప్రైవేట్ వాహనాల ఇష్టారాజ్యం

మండలంలో గ్రామాలు, తండాలకు ఆర్టీసీ బస్సులు లేక ప్రైవేటు వాహనాల డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు ఇదే అదునుగా భావించి అధిక చార్జీలను వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిమితికి మించి ఆటోలు ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఒక్కో ఆటోలో కనీసం 15 మందికి తక్కువ కాకుండా ఎక్కించుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఆటోకు ఇరువైపులా, వెనక వైపు నిలబడి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

పరిమితికి మించి ఆటోలలో ఎక్కించుకొని వెళ్తున్నా సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై అనుమానాలకు తావిస్తోంది. ఆటో డ్రైవర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రమాదాలు జరకముందే చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

బస్సులు నడపాలి



గ్రామానికి బస్సు రావడం లేదు. వనపర్తి, మహబూబ్‌నగర్ రోడ్డు ప్రధాన రహదారి గుండా మాత్రమే బస్సులు వెళ్తున్నాయి. గతంలో బస్సులు వెళ్తున్నా గ్రామాలకు కూడా ప్రస్తుతం బస్సులు నిలిపివేశారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

–నర్సింహ, అప్పారెడ్డిపల్లి

చర్యలు తీసుకుంటాం

ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటాం. ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలి. ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తాం. ప్రమాదాల నివారణకు ఇదివరకే అవగాహన కల్పించాం.

–శ్రీహరి, ఎస్‌ఐ ఖిల్లాఘనపురం

బీఆర్‌ఎస్‌తోనే పేదల సంక్షేమం


బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

చిన్నంబావి: బీఆర్‌ఎస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని కొల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దమారు గ్రామానికి చెందిన 50 మంది ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనకాల కోసం సీఎం కేసీఆర్ అహర్నిషలు కృషి చేస్తున్నారని అన్నారు. అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకటరమణమ్మ, సర్పంచ్ గోవింద్ శ్రీధర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బగ్గరి నర్సింహా రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మద్దిలేటి, చిన్నారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, తిరుపాలు, నాగేంద్రం, వేషు, ఉపసర్పంచ్ భీసన్న తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి


జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నివాళులర్పిస్తున్న నాయకులు, కవులు

వనపర్తిటౌన్: భారత స్వాతంత్ర్య పోరాటంలో వీర మరణం పొందిన పోరాట యోధుడు చంద్రశేఖర్ ఆజాద్ అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్ ప్రకాశ్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో చంద్రశేఖర్ ఆజాద్ 117వ, జయంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు గిరి రాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహా శర్మ, విభూది ఈశ్వర్, ప్రజా సంఘాల నాయకులు దేవన్న నాయుడు, బాలస్వామి నాయుడు, వెంకటేశ్వర్‌లు, బండలయ్య, నిదర్శన్‌గౌడ్, మన్యం యాదవ్, బాలు, రవీందర్‌గౌడ్, సత్యనారాయణ, నాగ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.


ఖిల్లాఘనపురంలో ..

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్ హాజరై ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరు ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు దాసర్ల భూమయ్య గ్రామానికి చెందిన యువకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయం


బొల్లారంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న రోజా రమణి

వీపనగండ్ల: పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి రోజా రమణి అన్నారు. ఆదివారం బొల్లారంలో గడప గడపకు బీజేపీ, గుండెగుండెకు ఎల్లేని కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. పలువురు బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటయ్య, కల్పనారాణా ప్రతాప్‌గౌడ్, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడలో ఆదివారం గడప గడపకు కమలం, గుండె గుండెకు ఎల్లేని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కుర్మయ్య, జింకల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని.. ఎల్లేని సుధాకర్‌రావుకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు రోజారమణి, పార్టీ నియోజకవర్గ నాయకుడు అన్వేష్ కోరారు. గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని జమ్మాపూర్‌లో వారు పర్యటించి ఇల్లిల్లూ తిరిగి ప్రధాని మోదీ నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర పథకాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యం చేస్తున్నామన్నారు. సోమశిల–సిద్ధేశ్వరం వంతెన కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జగన్‌గుప్తా, నాగరాజు నాయుడు, మధుసూదన్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి బీసీ కాలనీలో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, కల్పించాలని కోరుతూ ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఇళ్ల నిర్మాణాల కోసం గతంలో పేదలకు పట్టాలు పంపిణీ చేశారని వివరించారు. మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మార్చాలని, కాలనీలో డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళావతమ్మ, శ్రీరామ్, దంగు కుర్మయ్య, సభ్యులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన అమానుషం



వనపర్తి: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించడం హేయమైన చర్య అని చైతన్య మహిళా సంఘం నాయకురాలు రాధ, అలివేలు, లక్ష్మి, కీర్తన, సంధ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తిరుమల కాలనీలో సంఘం సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాగ్య, పద్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలుగా గుర్తించాలి



గట్టు: వాల్మీకి బోయలను ప్రభుత్వం ఎస్టీలుగా గుర్తించాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని బోయలగూడెంలో శనివారం రాత్రి ఆ సంఘం జిల్లా నాయకుల ఆధ్వర్యంలో గ్రామ కమిటీ అధ్యక్షుడిగా లింగన్నను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడమే లక్ష్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. వాల్మీకులందరూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బల్గెర హనుమంతు, కోటేష్, రాములు, న్యాయవాది మధుసూదన్‌బాబు, గద్వాల రామాంజనేయులు, మేకల తిమ్మప్ప, నాగశంకర్, భాస్కర్, వీరేష్, గూపద్‌నాయుడు, గట్టు మండల అధ్యక్షుడు రామునాయుడు, ప్రదాన కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

మంత్రికి వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మానవపాడు: గొల్ల కురుమలకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని కోరుతూ ఆదివారం బీఆర్‌ఎస్ నాయకుడు జల్లాపురం వెంకటేశ్వర్లు వనపర్తి జిల్లా కేంద్రంలో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 325 యూనిట్లు మంజూరు కాగా, 250 యూనిట్లు గ్రౌండింగ్ అయినట్లు తెలిపారు. అర్హులందరికీ గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని కోరారు. జల్లాపురం జాతీయ రహదారి నుంచి చందూరు వరకు బీటీరోడ్డు రెన్యువల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థులు

అయిజ: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య మాట్లాడుతూ గురుకుల హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతులు కల్పించేందుకుగానూ డైట్ చార్జీలను పెంచుతూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ హాస్టళ్ల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్


రోడ్డు పక్కన కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

మానవపాడు: మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. మండల పరిషత్, రెవెన్యూ, వ్యవసాయ, ఎమ్మార్సీ తదితర కార్యాలయాలకు వెళ్లే రోడ్డు పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచె ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారని, సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నత్తనడకన డ్రెయినేజీ పనులు


డ్రెయినేజీ నిర్మాణానికి తీసిన కాల్వ

అలంపూర్ రూరల్: మండలంలోని భీమవరంలో పంచాయతీ నిధులతో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దాదాపు 360 మీటర్ల మేర డ్రెయినేజీ నిర్మాణానికిగానూ నెలరోజుల కిందట కాల్వను తవ్వి వదిలేశారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడి పనులు ముందుకు సాగడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా డ్రెయినేజీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి నాగేంద్రమ్మను వివరణ కోరగా.. మిషనరీ, కూలీల కొరతతో పనుల్లో జాప్యం జరుగుతుందని పేర్కొన్నారు. పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

గట్టు: మండలంలోని పెంచికలపాడు ఎంపీటీసీ భారతమ్మ కుమారుడు న్యాయవాది శ్రీదర్శన్‌రెడ్డి, ఆయన అనుచరులు ఆదివారం హైదరాబాద్ గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో హస్తం గూటికి చేరగా, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మహానందిరెడ్డి, వడ్ల వీరేష్, గాండ్ల రాఘవేంద్ర, శివప్ప, నవీన్‌కుమార్‌రెడ్డి, నాగరాజు, తెలుగు గోవిందు, అర్జునప్ప, ఎల్లప్ప, మల్లికార్జున్, మైబు, మల్లి కార్జున్, బషీర్, తెలుగు నర్సింహులు, కుర్వ నర్సింహులు, భీమేష్, కర్రెప్ప, లక్ష్మన్న, మద్దిలేటి, మాల నర్సింహులు, గోపాల్ ఉన్నారు.



కొనసాగుతున్న కార్మికుల సమ్మె


మాట్లాడుతున్న గోపాలకృష్ణ

పెబ్బేరు రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. వనపర్తి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులకు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో పంచాయతీ యూనియన్ నాయకులు రామచంద్రయ్య, హనుమంతునాయక్, శ్రీను, సాయన్న, పెంటయ్య, నర్సమ్మ ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్లు


ఆత్మకూర్‌లోని బస్టాండ్ రోడ్డు


పట్టణంలో..

ఆత్మకూర్: ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లు గుంతలమయంగా మారాయి. గుంతలలో వర్షపు నీరు నిల్వడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. మున్సిపాలిటీ కేంద్రంలో గాంధీచౌక్ నుంచి అమరచింత వైపు పూర్తిగా రోడ్లు దెబ్బతిన్నాయి. బస్టాండ్ రోడ్డు, కొత్తకోట వైపు రోడ్డు బురదమయంగా దర్శనమిస్తోంది. పాత మున్సిపాలిటీ వైపు రోడ్డు ధ్వంసం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాలనీ రోడ్లు మరింత అధ్వానంగా ఉనఆయి. అధికారులు స్పందించి వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.


కొత్తకోట వైపు వెళ్లే రహదారి


గాంధీచౌక్ ఎదుట..

దారి పొడవునా బురదే..


తూంకుంట రహదారి

వీపనగండ్ల: మండలంలోని తూంకుంట ప్రధాన రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. తూంకుంట నుంచి సంగినేనిపల్లి గ్రామానికి రోడ్డు చిత్తడి చిత్తడి కన్పిస్తోంది. అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

దరఖాస్తులు ఆహ్వానం

పెబ్బేరు/అమరచింత/వీపనగండ్ల: పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాలలో రైతులు పండ్ల తోటలకు దరఖాస్తులు చేసుకోవాలని పెబ్బేరు ఏఓ చంద్రమౌళి, అమరచింత ఏపీఓ బాలయ్య, వీపనగండ్ల ఉద్యానశాఖ అధికారి కృష్ణ ఆదివారం వేర్వేరుగా ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023–24 సంవత్సరంలో పండ్ల తోటలు వేసుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు పేర్కొన్నారు. అయిదు ఎకరాలు లోపు ఉన్న అనువైన భూమి కలిగి జాబ్ కార్డు ఉన్న ప్రతి షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, చిన్న, సన్న కారు రైతులు అర్హులని వివరించారు. పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్‌ఖాతా, ఆధార్ కార్డు, ఉపాధి జాబ్ కార్డు, పాన్‌కార్డు, జిరాక్స్‌లతో పాటు ఫొటోలు మూడు, గ్రామ పంచాయతీ తీర్మానం ఉండాలని తెలిపారు. ఈ నె 31 వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

నిరుపయోగంగా గీజర్



వీపనగండ్ల: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో వేడినీటి కోసం ఆరు సంవత్సరాల కిందట పాఠశాలకు గీజర్ మిషన్‌ను మంజూరు చేశారు. గీజర్‌ను పాఠశాల ఆవరణలో పెట్టి వదిలేశారు. గీజర్‌ను బిగించకుండా అలాగే వదిలేయకడంతో విద్యార్థినులు చలికాలం, వర్షాకాలంలో చల్లని నీటితోనే స్నానం చేయాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో పాఠశాలలో చదువుతున్న దాదాపు 192 మంది బాలికలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. నిరుపయోగంగా ఉన్న గీజర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని బాలికల తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

శిథిల గృహాల్లో నివాసం ఉండొద్దు



ఆత్మకూర్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పాత నివాస గృహాలు కూలిపోయే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని పాత ఇళ్లలో ఎవరూ ఉండొద్దని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే మున్సిపాలిటీ అధికారులకు తెలపాలని కోరారు.

భగవద్గీతపై అవగాహన



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాల 2వ సెంటర్‌లో త్రైతసిద్ధాంత ప్రబోధసేవా సమితి మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రచార రథం ద్వారా ఆదివారం భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక వనపర్తి కమిటీ అధ్యక్షుడు వెంకట్రాములు మాట్లాడారు. ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన అవసరమన్నారు. గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడని పేర్కొన్నారు. గ్రామస్తులకు భగవద్గీత, ఆధ్యాత్మిత గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, స్వప్న, అలివేలు, లలిత, నాగరత్నం, కృష్ణయ్య, బద్రి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి రెడ్‌క్రాస్ సొసైటీ అండ



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని రాజపేట గ్రామానికి చెందిన కర్రెన్నకు సంబంధించి ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో దెబ్బతింది. విషయం తెలుసుకున్న జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ఆదివారం టార్పాలిన్, బెడ్‌షీట్లు, వంటసామగ్రి, ఆరోగ్యకిట్, నిత్యావసర సరుకులు బాధితుడికి అందజేశారు. వారికి సర్పంచ్ మాధవరెడ్డి, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ఖాజా ఖుతుబుద్దీన్, కోర్డినేటర్ రాజేందర్‌కుమార్, వలంటీర్ పాషా, ఉన్నారు.